రాళ్ళయిన ఆడపిల్లలు బయటపడే మార్గమేలేదా? కట్నం విధానం నశించాలి. వరకట్న దురాచారం అడుగంటాలి" అన్న మాట లనేకసార్లు రామనాథంగారి నోటినుండి వెలువడ్డాయి. వరకట్న దురాచార నిర్మూలనకై ప్రతినబూనుతూ అతని పిడికిళ్లు బిగుసుకున్నాయి.

యువతరానికి విజ్ఞప్తి :- పుట్టుకతోనే వృద్ధులైన ఓ! కొంతమంది యువకులారా! కుళ్ళుపట్టి కంపుకొడుతున్న సాంప్రదాయాలకు బానిసలై అప్పణంగా లభించే డబ్బుకై అమాయకురాళ్లయిన సోదరీమణులను పీడించి వాళ్ళ జీవితాలను నరకప్రాయం చేయకండి!

'కలకంఠి కన్నీరొలికినచోట నాశనం తప్పదు.'

(అన్నపూర్ణ – ఏప్రిల్, జూన్ 82)

# 2. ఇదేనా ఇంటర్వ్యూ?

ఎండ విపరీతంగా కాస్తుంది. ఇంటర్వ్యూ కొచ్చిన యువకులంతా చెట్లక్రింద గుంపులు గుంపులుగా గుమిగూడారు. భరింపరానిదైన ఆ ఎండ వేడికి చెమటలు ధారాపాతంగా కారుచున్నవి. బెల్‌బాటం ప్యాంట్లూ, రంగురంగుల బుషర్టులన్నీ తడిసి ముద్దయినవి. కళకళలాడుతూ ఉండాల్సిన ముఖాలన్నీ చెమటచే జిడ్డుగా తయారై వెలవెలబోవుచున్నవి. ఉదయం 9 గం॥కు ప్రారంభంకావల్సిన ఇంటర్వ్యూ

మధ్యాహ్నం ఒంటిగంటైనా ప్రారంభం కాలేదు. మారు మూల పల్లెలనుండి, ఎంతో దూరప్రదేశాలనుండి వచ్చిన ఆ నిరుద్యోగుల ముఖాల్లో దైన్యం తాండవిస్తుంది. కొందరి ముఖాల్లో ఆకలిబాధ ద్యోతకమవుతుంది. అందులో చాలా మందికి హోటల్ భోజనాల రేటు భరించే శక్తిలేదు. ఇం కొందరు హోటలుకెళితే తమ పేరెక్కడ పోతుందో అని నిరీ క్షిస్తున్నారు. ఆ ఆఫీసు సమీపంలో భోజన హోటల్ లేదు. అక్కడ దొరికే కషాయంలాంటి టీ నీళ్ళతోనే వాళ్ళు గడుపు తున్నారు. ఎప్పుడు ప్యూన్‌ను అడిగినా ఇంకొక ఐదు నిమి షాల్లో ఇంటర్వ్యూ మొదలవుతుందంటాడు గాని ఎక్కువ చెప్పడు. పాపమా యువకులు కళ్లు లోతుకుపోగా కాయలు కాచేట్లుగా నిరీక్షిస్తున్నారు. ఇంకా ఎదురుచూసే ఓపిక వాళ్ల లో నశించింది. ఒక గుంపు ఈలలువేశారు. కొందరు చప్పట్లు చరిచారు. లోపలినుంచి ఒక పెద్దమనిషి దూకుడుగా బయ టకువచ్చి "మీకేమన్నా మ్యానర్సున్నాయా? కాస్తఆలస్య మయితే ఓపిక పట్టరేం?" అన్నాడు. నాలుగైదు గంటల ఆలస్యాన్ని కాస్త ఆలస్యంగా గణించిన ఆ పెద్దమనిషి అభి నందనీయుడే. వేరేచోట్లయితే మ్యానర్సు లేవన్నందుకూ జీవి.బుర్ర రామకీర్తన పాడించేవారే, కాని తాము వచ్చింది ఇంటర్వ్యూకన్న విషయం జ్ఞప్తికొచ్చి మౌనం వహించారు.

"ఇంకెప్పుడా? ఇంటర్వ్యూ— ఇంటర్వ్యూ ఏమోకాని నా కుక్షిగాడు మొత్తుకుంటున్నాడురా— ఇంటర్వ్యూలో ఏం

ప్రశ్నలడుగుతారోయ్— ఏదో ఒకటి అడుగుతారు పోవోయ్- అడిగే ప్రశ్నలకు ఇచ్చే ఉద్యోగానికి పొంతనే ఉండదు. అసలా ప్రశ్న లెందుకడుగుతారో తెలియదు-" అని పలువురు ముచ్చటించుకోసాగారు.

"పేరుకేనోయ్ ఇంటర్వ్యూ- అసలింటర్వ్యూ వేరే ఉంటుంది-" జగమెరిగిన నిరుద్యోగి వ్యాఖ్యానం.

వేరొకచోట సినిమా గురించి చర్చ జోరుగా సాగుతుంది. చెట్టు మొదట్లో కూర్చున్న శేఖర్ వాళ్ళ మాటలను వింటూ నవ్వుకున్నాడు. శేఖర్‌ది కరీంనగర్ జిల్లాలోని తెలుగుపల్లి గ్రామం. తల్లిదండ్రులు పేదవారైనా కష్టపడి అతన్ని గ్రాడ్యుయేషన్‌చదివించారు. తర్వాత నాలుగైదేళ్లుగా ఉద్యోగాల వేటలో చిక్కి శల్యమైనాడు. తల్లిదండ్రుల జవసత్వాలుడిగాయి. చెప్పుకోదగిన ఆస్తిలేదు. చెల్లెలిద్దరు పెళ్ళికెదిగారు. ఇంటికి పెద్దవాడైన శేఖర్‌పైననే కుటుంబం ఆధారపడి యుంది. ఎన్నో ఇంటర్వ్యూలకు వెళ్ళి నిరాశగా తిరిగి వచ్చాడు. ఈ ఉద్యోగం దొరకనిచో ఊళ్ళో కూలిపని గాని, పట్నంలో రిక్షాలాగికాని బ్రతుకాలని నిశ్చయించుకున్నాడు. ఈఉద్యోగంవచ్చే సూచనలు లేకుంటే ఇంటర్వ్యూలో తన ఆవేశాన్నంతా కటువైన మాటలతో వెళ్ళగ్రక్కాలని నిర్ణయించుకున్నాడు. ప్రక్కనెవరోమాట్లాడుతున్నారు.

'ఎల్. డి. సి. పోస్టులెన్ని?' 'ఎనిమిది'.

'ఇంటర్వ్యూకెంతమంది వచ్చారు?' 'ఐదువందలు.'

'ఎనిమిది పోస్టులకు ఐదువందల మంది' గొణుక్కు న్నాడు. ఇంతలో గోడగడియారం టన్‌మని ఒకటికొట్టింది. అంటే రెండున్నర అయిందన్నమాట. ప్యూన్ బయటకు వచ్చి 'సురేందర్‌రెడ్డి' అని కేకవేశాడు.

ఇంటర్వ్యూ మొదలయిందని ఎవరికివాళే సర్దుకుంటు న్నారు. ఒకరితర్వాత మరొకరు లోపలికి పోయివస్తున్నారు. లోపలినుంచి వచ్చినవాళ్ళచుట్టూ బయటివాళ్ళంతా ఈగల్లా ముసురుకుంటున్నారు.

"మిమ్మల్నేమడిగారు?- అక్కడెందరున్నారు?- దేని విషయంపై ఎక్కువ ప్రశ్నించారు?- జవాబెలా చెప్పారు?" అని ప్రశ్నించసాగారు. అడిగేదేముంటుంది, ఆ ఎనిమిది సీట్లె ప్పుడో రిజర్వు అయిపోయాయి. నీ పేరేమి? ఊరేమి? మరి కొన్ని చొప్పదంటు ప్రశ్నలు. అసలు ఇంటర్వ్యూ వేరేర కంగా ఉంటుంది అని వెళ్ళిపోసాగారు.

శేఖర్ వాళ్ళ మాటలు విన్నాడు. ఇక ఉద్యోగం దొరుకుతుందన్న ఆశలేదు. తిరిగి పోదామనుకున్నాడు. వచ్చినవాన్నెందుకు పోవాలి- ఇంటర్వ్యూచూసేపోదామని నిర్ణయించుకున్నాడు. సమయంకొరకు ఎదిరిచూస్తున్నాడు. ఐదు కావస్తోంది. ఇంకా తన పేరు రాలేదు. కడుపులో ఆకలి మంటలు విజృంభిస్తున్నాయి. నీరసంగా ఉంది. ఇంతలో 'శేఖర్! శేఖర్' అన్న ప్యూన్ కేక వినపడింది. గబగబవెళ్లాడు. హాల్లోకి ప్రవేశించాడు. హాల్లోవున్న ఇద్దరాఫీసర్లకు నమస్క

రించాడు. తనకు నిర్దేశించిన కుర్చీలో కూర్చున్నాడు. ఇంటర్వ్యూ మొదలైంది.

'నీ పేరేమిటి'? ఆఫీసర్ ప్రశ్న.

'శేఖర్' సారు- జవాబు.

'ఏం శేఖరోయ్'? ఆఫీసర్ల నిర్లక్ష ప్రశ్న.

'ఆర్. శేఖర్ సార్.'

'మీ తండ్రి పేరు?' 'నరనాథం'

'మీదేవూరు?' 'తెలుగుపల్లె.'

ఆఫీసర్ శేఖర్ దుస్తులను ఒకసారి జిడ్డుపట్టిన ముఖాన్నొకసారి చూసాడు.

'ఇంటర్వ్యూకు నీటుగా రావాలని తెలియదా?' శేఖర్ కు ఒళ్ళు మండుతుంది. అయినా తమాయించుకున్నాడు. "తెలిసినా ఏం చేయాలి సార్? నాకున్నవే రెండు డ్రెస్సులు. అందులో ఒకటి సగం చినిగింది. ఈ ఒక్కటే ఎక్కడికి వెళ్ళినా. నాలుగైదేళ్లుగా నిరుద్యోగిగా ఉన్న నాకు కొత్త బట్ట కుట్టించుకోవడం ఎలా సాధ్యమవుతుంది?" అన్నాడు. ఆఫీసర్ ఏమనుకున్నాడో కాని మళ్ళీ ఏం ప్రశ్నించలేదు. రెండవ ఆఫీసర్ ప్రశ్నించడం మొదలుపెట్టాడు.

"మీ అసెంబ్లీ కాన్‌స్టిటుయెన్సీ ఏదిటోయ్?"

"మ్యాడారం."

"నీకు ఈతవచ్చా?"

ఈ ప్రశ్నకు మరీ విస్తుపోయాడు శేఖర్ కొంపదీసి

ఈ ఆఫీసర్‌కు ఈత నేర్పడం ఉండదుకదా! అనుకొన్నాడు. కోపం తారాస్థాయికి చేరసాగింది. తమాయించుకున్నాడు. "వచ్చు" అన్నాడు.

"యు కెన్ గో నౌ" అన్నాడు ఆఫీసర్.

ఈ మాటకు నవ్వాలో ఏడ్వాలో తెలియలేదా నిరుద్యోగికి. ఇదేనా ఇంటర్వ్యూ? ఎల్.డి.సి. పోస్టు కవసరమయ్యే ప్రశ్నలివేనా? అనుకున్నాడు. ఎలాగూ తనకు ఉద్యోగం రాదు. ఏమైనాసరే నాలుగు దులిపిపోవా లనుకున్నాడు. "ఇంటర్వ్యూ అయిపోయిందా సార్!" అని అడిగాడు శేఖర్.

"ఇంకా ఉందనుకుంటున్నావా?" రెండో ఆఫీసర్ వ్యంగ్య జవాబు.

"ఎలా అనుకుంటాను సార్! అలా అనుకోవడానికి అవకాశంలేదే. ఎల్. డి. సి. పోస్టు కవసరమయ్యే ప్రశ్నలను చాలాబాగా అడిగారు సార్" అన్నాడు. "ఏం పొగరా! బాగా మాట్లాడుతున్నావు. నీవెవరితో మాట్లాడుతున్నావో తెలుసా"? అన్నాడు- కోపోద్రిక్తుడైన ఆఫీసర్.

"తెలుసు సార్- నాకు బాగా తెలుసు. యాభై అరవై మంది గుమాస్తాలపై అధికారం చెలాయిస్తూ ఈ పట్నంలోని ఒక ప్రముఖుడైన వ్యక్తితో మాట్లాడుతున్నానన్న విషయం నాకు బాగా తెలుసు మీరు తలుచుకుంటే నన్నేమైనా చేస్తారన్న విషయంకూడా తెలుసు. మీరేంచేసినా ఫరవాలేదు. కాని పొగరులాంటిది వేలకొద్ది జీతాలు తీసుకుంటూ పదవికి

న్యాయం చేకూర్చక, కనీసం సర్టిఫికెట్లయినా చూడక, ఇంటర్వ్యూలో అర్థంలేని ప్రశ్నలడుగుతూ, కష్టపడి ఫస్టుక్లాసు వచ్చినా కేర్ చెయ్యకుండా ఉండే మీలాంటివారికి తప్ప నాలాంటి నిరుద్యోగుల కుండదన్న సంగతి మర్చిపోకండి” అన్నాడు ఆవేశంగా శేఖర్. “హోహోహోయ్! నీ బోడి ఫస్టుక్లాసు నువ్వూనూ. త్వరగా పోతావా ప్యూన్‌తో గెంటించమంటావా” అన్నాడు రెండో అఫీసరు.

మీకా శ్రమ అక్కర్లేదు సార్ నేనే పోతాను. పోయే ముందు నా యీ మాటలు వినండి సార్. అష్టకష్టాలు పడి తమ రక్తాన్ని ధారబోసి నా తల్లిదండ్రులు నన్ను గ్రాడ్యుయేట్‌ను చేసింది మీలాంటివారిచే మెడలుపట్టి గెంటించుకోడానికే సార్. అహోరాత్రులు నిద్రాహారాలు మాని, చదువే ముఖ్యోద్దేశంగా పెట్టుకొని స్వయంశక్తితో ఫస్టుక్లాసు వచ్చుటకు నేను పడ్డ పాట్లు మీలాంటివారి కెలా అర్థమవుతాయి సార్. నా చదువుకే సర్వం హరించుకుపోగా ఆకలి మంటలతో అలమటిస్తున్న మా పేద కుటుంబం గోడు, జీర్ణంకాకుండా తిని భుక్తాయాసం చెందే మీకేం తెలుస్తుంది సార్ శరీరంనిండా గుడ్డ కప్పుకోవడానికైనా శక్తిలేక- చలిలో, ఎండలో, వానలో అర్ధనగ్నంగా పేదవారి బాధలు, ఒక్క సంతకంతో వందలు, వేలు సంపాదించుకొంటూ క్లబ్బుల్లో పేకాటలలో విలాసాలకు మంచినీళ్ళ ప్రాయంగా ఖర్చుచేసే మీ కెలా తెలుస్తాయిసార్. మీకు తెలిసిందల్లా మాలాంటి

డబ్బు రికమండేషన్ లేని నిరుపేదలను మెడలుపట్టి గెంటించడం. మీకవసరమయింది ఫస్టుక్లాసుకాదు; అర్హతలసలే కాదు- డబ్బు- నీచపు డబ్బు. పోయేటప్పుడు మీ హోదాను డబ్బును మూట్లగట్టుకొని మరీ వెళ్ళండి. మాలాంటి నిస్సహాయుల ఉసురు మీకు తప్పకుండా తగుల్తుంది. పోతానుసార్ ఇంత టైము తీసుకున్నందుకు క్షమించండి సార్ ఆజ్ఞాపించండి సార్ పోతాను_" కళ్ళవెంబడి నీరు కారుతుండగా ఊగుతూ అన్నాడు శేఖర్.

శేఖర్ మాట్లాడుతున్నంతసేపు శిలా ప్రతిమల్లై చూస్తూ ఉండిపోయారా ఆఫీసర్లు. అతని మాటలు వింటున్నకొలదీ మొదట ప్రశ్నించిన ఆఫీసరుగారి మనస్సు పరివర్తనం చెందసాగింది. హృదయం ద్రవించసాగింది. తల్లిదండ్రులు చదువుకై రక్తాన్ని ధారబోసారన్న మాటలు ఆఫీసరుగారిని పూర్తిగా ద్రవీభవించేలా చేసాయి. అతని మస్తిష్కంలోకి అనేకాలోచనలు రాసాగాయి. ఉద్యోగానికై తాను పడ్డ పాట్లు తన 'అక్క', అంతా జ్ఞాపకంవచ్చి మనస్సు గతంలోకి పరుగిడింది.

రాంబాబు బి. ఎస్ సి. పాసయ్యాడు. ఆ సమయంలోనే తండ్రి చనిపోయాడు. మరికొన్ని రోజులకే తల్లి తండ్రిని కలుసుకొన్నది. మిగిలిందల్లా రాంబాబు అక్కయ్యొక్కతే. ఆమె కింకా పెళ్ళికాలేదు. ఉన్న ఆస్తి, అప్పు చూసేసరికి ఒక ఇల్లు కొంత చిల్లర పైకంతప్ప ఏమీ మిగులలేదు. కుటుంబ

భారమంతా రాంబాబు మీద పడ్డది. ముఖ్యంగా పెళ్ళికాని అక్కకోరకై అతనికి దిగులుగా ఉంది. తాను బి. ఎస్సి. పాస య్యాడు. ఎలాగైనా ఉద్యోగం సంపాదించుకుంటే తన కష్టాలు తీరుతాయనుకున్నాడు. డబ్బు లేందే ఉద్యోగంరాద న్న అభిప్రాయంతో ఉన్న ఇల్లు అమ్మి పట్నంలో ఒక చిన్న గది అద్దెకు తీసుకొని ఉద్యోగాల వేట సాగిస్తున్నాడు. అతని అక్కయ్య ఎంత పొదుపుగా ఖర్చుచేసినా ఎంత కాలమని ఆగగలదా డబ్బు? కూర్చుండి తింటే కొండలైనా తరుగు తాయి. క్రిమక్రమంగా అతనివద్ద డబ్బు హరించుకుపోసా గింది. కాని ఉద్యోగం దొరికే సూచనలేవీ కనపడటం లేదు. ఇంకా రెండు మూడు నెలలవరకు ఉద్యోగం దొరుకనిచో వాళ్ళకు పస్తులుండటం తప్పదు. రాంబాబుకు భవిష్యత్తు భయంకరంగా కనిపించింది. ఈడేరిన అక్కయ్య, నిరుద్యోగి యైన తాను ఏంచేయాలో తోచలేదు. ఆఖరి ప్రయత్నంగా ఎక్స్చేంజ్ డిపార్టుమెంటులో ఉద్యోగానికై ఇంటర్వ్యూకు వెళ్లా లని నిర్ణయించుకున్నాడు. దీన్నెలాగైనా సంపాదించాలి లేనిచో తన అర్హతలు మరచి ఏ కూలిపనైనా చేసి బ్రతు కాలని నిర్ణయించుకున్నాడు. ఇంటర్వ్యూ కెళ్లాడు.

ఇంటర్వ్యూ హాల్లో ఆఫీసర్ భారమైన శరీరాన్ని కుర్చీ లో కూలవేసి ఆయాసంగా కాళ్ళు చాపుకొని బొర్రను నిము రుకుంటూ కూర్చున్నాడు.

'నీ పేరు?' అడిగా డాఫీసర్.

'రాంబాబు-'

'ఎంతవరకు చదివావు?'

'బి. యస్సీ. క్లాసు వచ్చాను.'

'ఎక్కడుంటున్నావు?'

'ప్రస్తుతము ఈ ఊళ్ళోనే-'

ఈ ఊళ్ళోనే అన్నప్పుడా ఆఫీసర్‌గారి ముఖంలో మార్పు గమనించాడు రాంబాబు. 'షటప్- రోడ్డులో గ్రీన్ బిల్డింగ్ ప్రక్క ఇంటిలోనా?'

రాంబాబు కీ ప్రశ్న ఎందుకడుగుతున్నాడో తెలియ లేదు. ఇంటర్వ్యూలో ఇండ్లతో పనేమిటో అసలే అర్థం కాలేదు. 'ఔను సార్-' అన్నాడు రాంబాబు.

"నేను చూసుకుంటాను వెళ్ళిపో-" చిరుహాసం చేసా డాఫీసర్. రాంబాబు ఏదో మాట్లాడాలనుకున్నాడు కాని ఆఫీసు ప్యూను తొందరచేయడంలో గత్యంతరంలేక బయట కొచ్చాడు. తనకుద్యోగం దొరుకుతుందన్న ఆశ పూర్తిగా నశించింది. నిరాశతో కాళ్ళీడ్చుకుంటూపోయాడు. తెల్లవారి నుంచి ఒక కిరాణా దుకాణంలో గుమాస్తాగా నెలకు 150/- జీతానికి చేరాడు. తన జీతం తన తిండికే చాలడంలేదు. అక్కయ్య పెళ్ళి ఎలా చేయాలో అతనికి అయోమయంగా ఉంది. జీవచ్ఛవంలా కాలంగడుపుతున్నాడు. దాదాపు రెండు నెలలు గడచినవి.

ఒకనాడు రాంబాబును ఆశ్చర్యసాగరంలో ముంచి

వేస్తూ ఎక్సైంజి డిపార్టుమెంటునుంచి అపాయింటుమెంటు ఆర్డర్ వచ్చింది. ఇది కలా? నిజమా? అని ఆశ్చర్యపో యాడు. సందేహంలేదు; తనపేరే. అపాయింటుమెంటు ఆర్డర్ అక్కకుచూపి ఎగిరి గంతులువేసాడు. కాని అక్కయ్యా రాంబాబు ఆశించినంతగా సంతోషించలేదు. అది మామూలే అన్నట్లుగా నిర్లిప్తంగా ప్రవర్తించింది. కొన్ని రోజులుగా అక్కయ్య ఎందుకు నిర్లిప్తంగా ఉంటుందో రాంబాబుకర్థం కాలేదు. తన కొచ్చే జీతంతో కొంత డబ్బు జమచేసి, మరి కొంత అప్పుచేసి అక్కయ్య పెళ్ళి చేయ్యాలని నిర్ణయించు కున్నాడు. ఆఫీసర్‌గారు తనపై చూపిన దయకు జోహార్ల ర్పించాడు. ఆఫీసర్‌గారిది తాను నివసిస్తున్న గదిపక్కనున్న బిల్డింగ్. సహృదయుడైన ఆఫీసర్ తన బాధలు తెలుసుకొని తనకీ ఉదోగం ఇప్పించియుంటాడనుకొన్నాడు. ఆఫీసర్ గారిని నిలుసుకొని కృతజ్ఞతలు తెలిపాడు. ఉద్యోగంలో ప్రవేశించాడు. ఇప్పుడు డబ్బుకేం యిబ్బందిలేదు. కాని అక్కయ్యలో రోజురోజుకి నిరుత్సాహం, దైన్యం పెరిగిపో తున్నది. తన కుద్యోగం దొరికినందు కామె సంతోషించాలి కాని ఆమె ఎందుకలా అవుతున్నదో అతని కెంత ఆలోచిం చినా అర్థం కాలేదు. అక్కయ్య పెళ్ళిగురించి ఇద్దరు ముగ్గు రితో సంప్రదించాడు. నాలుగురోజుల క్రితం వరంగల్లులో ఉన్న మేనమామ ఇంటికి పోయిన అక్కయ్య రాకకొరకై ఎదిరిచూస్తున్నాడు. ఆమె వచ్చిన వెంటనే ఆమెతో సంప్ర

డించి వీలైనంత త్వరగా ఆమెకు పెళ్ళిచేయాలని నిర్ణయించు కున్నాడు. ఆఫీసునుంచి వచ్చి పడక కుర్చీలో కూర్చొని అక్కయ్యగూర్చి ఆలోచిస్తున్న రాంబాబుకు పోస్టు అన్న కేక వినపడింది. గబగబలేచి పోస్టుమ్యాన్ చేతిలోని కవరుపై ముత్యాల్లాంటి అక్కయ్య చేతివ్రాతను చూసి అది అక్కయ్య వ్రాసిన ఉత్తరంగా నిర్ధారించుకున్నాడు. పడక కుర్చీలో కూర్చుని కవరు చింపాడు. ఉత్తరం చదువుతున్న రాంబాబు ముఖం వివర్ణం కాసాగింది.

చిరంజీవి రాంబాబుకు-

మీ అక్క ఆశీర్వదిస్తూ వ్రాయు లేఖ-

తమ్ముడూ! మీ అక్కయ్య మేనమామ ఇంటికి పోయిం దనుకున్నావు కదూ! నీకెలా వ్రాయాలో నాకర్థం కావడం లేదు. పేదరికాన్ని, నిస్సహాయతను ఆసరాగా తీసుకొని పేదల జీవితంతో ఆటలాడుకునే స్వార్థపరులగు ఘరానా మనుషులు ఉన్నంతవరకు నాలాంటి జీవితాలకు ఇలాంటి ముగింపు తప్పదు.

నీవు ఇంటర్వ్యూకు పోయివచ్చిన తెల్లవారి ఆఫీసర్ గారు గార్డెన్‌లో విహరిస్తున్నారు. ఏదో పనిమీద బయట కెళ్లిన నన్ను చూసారు. పిలిచారు. తండ్రిలాంటివారుకదా అని పోయాను. అతడక్కడ ఒంటరిగానే ఉన్నాడు. ఇంట్లో ఎవరున్న జాడలేదు- నీవు ఇంటర్వ్యూకు పోయింది వాళ్ళ ఆఫీసుకేననీ, అతి మంచి భవిష్యత్తుగల ఉద్యోగమనీ,

అలాంటిది జారవిడుచుకోవడం తెలివితక్కువతనమనీ చెప్పాడు. ఆ ఉద్యోగం నీకిప్పిస్తే ఆఫీసర్ గారికి కృతజ్ఞతగా ఉంటామని చెప్పాను. ఆ ఉద్యోగం నీకు రావాలంటే నేనాతనికి లోబడాలని, నా కన్యత్వ మర్పించాలని షరతు పెట్టాడు. ఇలాంటి కోర్కె కోరడం సబబుగాదని నచ్చచెప్పి చూసాను- బ్రతిమాలాను- కాళ్ళవేళ్ళ పడ్డాను. కాని ఆతడు తన కోర్కెను విరమించుకోలేదు.

మన పరిస్థితులన్నీ దృష్టిలో ఉంచుకొన్నాను. ఆ ఉద్యోగం దొరుకనిచో మన పొట్ట గడవడం కష్టం. ఉద్యోగంలేని నీ భవిష్యత్తు భయంకరంగా కనిపించింది. దాదాపు నా సగం జీవితం మోడుబారిపోయింది. నా భవిష్యత్తేమయినా, నా బంగారు తమ్ముడి భవిష్యత్తు సుఖమయం కావాలనిఆశించాను. నీవు సుఖ సంతోషాలతో ఉంటే నా కదే పదివేలని తలచాను. నా శీలాన్ని ఆఫీసర్ కు అర్పించాను. తత్ఫలితమే నీ అపాయింటుమెంటు ఆర్డర్. అవకాశం దొరకినప్పుడల్లా నా శరీరంతో ఆడుకున్నాడతడు.

కలుషితమైన ఈ దేహాన్ని వేరొకరికి గృహిణిగా సమర్పింపలేను. లోకుల కళ్ళు గప్పినా నా అంతరాత్మ నన్ను ప్రశ్నిస్తునే ఉంటుంది. అంతేకాకుండా నేనిప్పు డాఫీసర్ పాప ఫలాన్ని మోస్తున్నాను. లోకం నన్ను వేలెత్తి చూపుతూ నిన్ను అవమానిస్తే నేను భరింపలేను. అందుకే ఎవరూ చూడని లోకాలకు, స్వార్థం, మమకారం, ద్వేషంలేని పవిత్ర

లోకాలకు వెళ్ళిపోవుచున్నాను. నాకొరకు నీవు విచారించకు.

ఒక్కమాట! నా కన్యాయం జరిగిందని ఆఫీసర్ గారిపై క్రోధం వస్తుందికదూ! కాని తమ్ముడూ! గోముఖవ్యాఘ్రమైన ఆఫీసర్ జోలికి పోకు. పొట్టేలు కొండతో ఢీకొంటే ఏమవుతుంది? అనాదినుండి ఉన్నవాడు లేనివాడిని దోపిడి చేస్తునే వున్నాడు. ఎలాగూ అంతమైన నాకొరకు నీ బంగారు భవిష్యత్తును భగ్నం చేసుకోకు. నీవు సుఖసంతోషాలతో ఉండడమే నీవు నీ అక్కయ్యకిచ్చే నిజమైన నివాళి. నీకీ ఉత్తరం అందేలోగా నేనీ లోకంనుండి నిష్క్రమిస్తాను. నాకై వెదకి వృధా ప్రయాసపడకు.

సెలవు—

శాశ్వత విశ్రాంతి తీసుకుంటున్న
నీ అక్కయ్య.

ఉత్తరం పూర్తిచేసిన రాంబాబు కళ్ళ వెంబడి నీళ్లు ధారాపాతంగా కారసాగాయి. శరీరమంతా ఆవేశంతో ఊగిపోసాగింది. క్రోధంతో పళ్ళు పటపట కొరికాడు. ఆవేశంలో అక్క చేసిన హెచ్చరికను మరిచాడు. పయోముఖ విషకుంభం లాంటి ఆఫీసర్‌ను చిత్రవధ చేయందే తన ఆవేశం చల్లారదు. కత్తి తీసుకున్నాడు. రొప్పుతూ ఆఫీసర్ ఇంటికి వెళ్లాడు. "రాస్కెల్, నిన్ను పరలోకానికి పంపుతా" నని పొడవబోయాడు. రాంబాబు వాలకం గమనించిన పనివాళ్ళిద్దరు అతన్ని గట్టిగా పట్టుకొని ఆపారు. ఆఫీసర్, రాంబాబు తనపై

త్రాగిన మైకంలో హత్యాప్రయత్నం చేసాడని కేసుపెట్టాడు. రాంబాబు పోలీసు స్టేషన్ల చుట్టూ, కోర్టులచుట్టూ కాళ్ళరిగేలా తిరిగాడు. చివరకు ఎలాగో కేసు కొట్టివేయబడింది. సర్వ కష్టాలుపడి బదిలీ చేయించుకున్నాడు. లౌక్యం తెలుసుకున్నాడు. అంచెలంచెలుగా పైకి వచ్చి ఆఫీసరయ్యాడు.

కుర్చీలో కూర్చున్న రాంబాబు ఆవేశంతో ఊగుతున్న శేఖర్‌ను "బాబూ, నీతో కొంత మాట్లాడాలి- నాతోరా" అని ఇంటర్వ్యూ బాధ్యత వేరే ఆఫీసర్‌కు అప్పచెప్పి, శేఖర్‌ను తీసుకొని వేరే రూంలోకి పోయాడు. ఇద్దరూ కూర్చున్నారు. రాంబాబు కళ్ళవెంబడి ధారాపాతంగా కారుతున్న నీళ్ళనుచూసిన శేఖర్ "సార్, మీరు ఏడుస్తున్నారా?" అని ప్రశ్నించాడు.

"కాదని ఎలా తప్పించుకోగలను బాబూ! వేల జీతాలు పొందే ఆఫీసర్‌గారికి కన్నీరేమిటని ఆశ్చర్యంగా ఉందికదూ! బాబూ, నీవారోపించినట్టుగా ఇంటర్వ్యూలోని అవకతవకలకు మొత్తం బాధ్యత మాదేకాదు; మేము కొంత బాధ్యులమైనా మాకున్న స్వాతంత్ర్యం అత్యల్పం. మాలో మానవత్వమున్నవాళ్ళున్నారు. అయినా వాళ్ళ మాటను సాగనిచ్చేదెవరు? మేము నాయకుల పైరవీకార్ల చేతుల్లో కీలుబొమ్మలం" అన్నాడు బాధగా. "సార్! మీరనే దేమిటో తెలియడం లేదు-" అన్నాడు విస్మయంగా శేఖర్. "బాబూ, నేనూ మొదట ఆదర్శాలకు, ఆశయాలకు విలువ యిచ్చిన మనిషినే, కాని నిజ జీవితంలో నా ఆదర్శాలకు- ఆశయాలకు విలువలే

కుండా పోయింది. నేను మొదట రికమండేషన్‌లకు, లంచా లకు లొంగక యోగ్యతకే ప్రాధాన్యత నిచ్చి ఉద్యోగాలిచ్చే వాడిని. తత్ఫలితంగా రాజకీయ నాయకుల ఆగ్రహానికి, పై ఆఫీసర్ల దూషణలకు గురియై బదిలీలమీద బదిలీలు చేయబడి నానా ఇబ్బందులపాలయ్యాను. ప్రమోషన్లులేక అణగద్రొక్క బడ్డాను కుళ్ళి కంపు కొడుతున్న ఈ సమాజంలో ఘరానా మనుష్యులు, పెత్తందార్లు అధికారం చెలాయిస్తున్న ఈ దేశం లో ఆదర్శాలు, ఆశయాలు కేవలం మాటలని అనుభవపూర్వ కంగా తెలిసికొన్నాను. ఆదర్శాలు, ఆశయాలకు ముక్కుకు సూటిగా పోయేవారు అథఃపాతాళానికి తొక్కబడుతారు. అందుకే ముక్కుకు సూటిగా పోవడం మానుకున్నాను. నాయ కుల ప్రాపు సంపాదించాను. క్రమంగా పైకి వచ్చాను.

ఇప్పుడు నేనీ పట్టణంలోని ప్రముఖులలో ఒక్కణ్ణి— అయినా మాకేం స్వాతంత్ర్య మున్నది— మేము రాజకీయ నాయకుల చేతులలో కీలు బొమ్మలం. మా యిష్టప్రకారం ట్రాన్స్ఫర్లు, అపాయింటుమెంట్లు చెయ్యడానికి వీలులేదు. ఎన్నో రికమండేషన్లు, లంచాలు, బెదరింపులు పాటించక పోతే కష్టాలు. ఈ విషవలయంలో అర్హతలున్నా, మెరిట్ ఉన్నా పలుకుబడి, డబ్బు లేంది ఉద్యోగమెలా వస్తుంది?" అని తన కథనంతా క్లుప్తంగా చెప్పాడు.

రాంబాబు మాటలు విన్న శేఖర్ ఆశ్చర్యపోయాడు— పశ్చాత్తాప పడ్డాడు. "సార్! అన్నిటికీ మూలం ఆఫీసర్లేనని

పొరపాటుపడి మిమ్మల్ని బాధపెట్టినందుకు క్షమించండి. మీలో ఇంత విషాదం గూడుకట్టుకొని ఉన్నదనుకోలేదు' అన్నాడు శేఖర్.

శేఖర్‌నుచూస్తే పూర్తిగా మనసువిప్పి మాట్లాడాలని పించింది రాంబాబుకు. తానున్న హోదా మరిచి- 'బాబూ! ఈ ఉత్తరాలు చూడు: ఇంటర్వ్యూల బండారం బయటపడు తుంది. ఉన్నపోస్టులు ఎనిమిది. మినిస్టర్ల దగ్గరనుండి వచ్చిన రికమండేషన్లే ఇరవై ఉన్నవి. ఇంకా లోకల్ లీడర్ల దగ్గ ర్నుంచి, ఎం. ఎల్. ఏ. ల దగ్గర్నుంచి ఎన్నెన్నో రికమం డేషన్లు, ఫోన్‌కాల్స్, డబ్బు లంచం- నానా గందరగోళం-' అని తనవద్దనున్న ఉత్తరాలను శేఖర్ కందించాడు.

శేఖర్ వాటినందుకొని చదివాడు. అవి వివిధ డిపా ర్టుమెంటులకు చెందిన ఆఫీసర్లనుంచి, లీడర్లనుంచి, మినిస్ట ర్లనుంచి, ఎం. ఎల్. ఏ. ల నుంచి వచ్చాయి. అందులో ఇతడు మా దగ్గర బంధువని, చెల్లెలు కొడుకని, మిత్రుని కొడుకని, కావల్సినవాడని, తప్పకుండా ఉద్యోగమివ్వాలన్న హెచ్చరిక ఆఫీసర్‌కుంది. అందులోని రెండుమూడుత్తరాలు చూసి మరీ విస్తుబోయాడు శేఖర్. ఒకదాంట్లో ఆఫీసర్ గారిని కీర్తిశేషులని సంబోధించారు. అది లోకల్ ఎమ్మెల్యే వ్రాసిన లేఖ. మరొకదాంట్లో ఉత్తరం క్రింద వేలిముద్ర ఉంది. ఇలాంటి అక్షరం ముక్కరాని ప్రబుద్ధులు విద్యాధికు లైన ఆఫీసర్ల సాధించడం, అహో! ప్రజాస్వామ్యమా నీకు

జోహార్లు. ఇలాంటి నాయకుల నెన్నుకున్న ఓటరు మహాశయులారా! మీకు అభినందనలు. ఆ ఉత్తరాలన్నీ మలచి రాంబాబు చేతికిచ్చాడు శేఖర్. 'సార్! ఇంటర్వ్యూలవెనుక ఇంత తతంగమున్నాంక ఒక్క ఆఫీసర్ల నని లాభమేముంది? ఇంటర్వ్యూల బండారం బయట పెట్టేశారు. కనువిప్పు కలిగించినందుకు కృతజ్ఞుణ్ని సార్. ఈసారి ఉద్యోగాల ఛాయలకే రాను. రిక్షాలాగైనాసరే, నా ముసలి తల్లిదండ్రులను పోషిస్తాను. చిన్నవాణ్నైనా ఒక్కమాట చెప్తానుసార్. ఈ రోజుల్లో మనసున్నవాడు జీవించడం కష్టం. బ్రతకడం నేర్చుకోవాలంటే మనసును వదలివేయాలి. మనసునుచంపుకొని బానిసగా బ్రతికేకంటే కూలిపని చేసుకొనియైనా స్వతంత్రంగా జీవిస్తాను' అని రాంబాబుకు నమస్కారంచేసి వెళ్ళిపోయాడు శేఖర్.

శేఖర్ తీసుకొన్న నిర్ణయం సరియైనదేనా? తాను ఉద్యోగం చేయనంత మాత్రాన సమస్యలు పరిష్కారమౌతాయా? సమాజంలో అవినీతి, ఆశ్రిత పక్షపాతం, బంధుప్రీతి ఎలా అంతం కావాలి? పేదవాళ్ళ నిస్సహాయ స్థితిని ఆసరాగా చేసుకొని వాళ్ళ జీవితాలతో ఆడుకునే నయవంచకులకు ఏశిక్ష విధించాలి? అర్హతలు లేనివారు అందలాలెక్కి అధికార దుర్వినియోగం చేస్తుంటే అమాయకులు బలి కావల్సిందేనా? ఇవన్నింటికీ పరిష్కార మార్గాలేమిటి? ఆలోచించండి! *

(చిత్రిక- ఆగస్టు 83 సంచికలు)